# ప్రమాదించిన పరిహాసం

ఎ.పి. ఎక్స్‌ప్రెస్ ఎంత స్పీడ్‌గా పరిగెడుతోందో చెప్పడం కష్టంగానీ - ఆ టైములో ఆ కంపార్టుమెంటులో కూర్చున్న అరవైయ్యేళ్ళు దాటిన పెద్దమనిషి మాటల ధోరణి మాత్రం ఆ రైలు వేగాన్నే కాకుండా శబ్దాన్ని కూడా అధిగమించిపోతోంది.

ఆ కంపార్టుమెంటులో కూర్చున్న ప్రతీ ఒక్కరూ ఆ వ్యక్తినే విచిత్రంగా చూస్తూ ఆయన చెప్పే మాటల్ని వింతగా వింటున్నారు.

తనతోపాటే ఢిల్లీలో ఆ పెద్దమనిషీ ఎక్కాడు. ఇద్దరికి ఎదురెదురు సీట్లే వచ్చాయి. వేసవి సెలవులివ్వడంతో నిండు గర్భిణీలా వుందా రైలు. రిజర్వేషన్ లేని వ్యక్తులు బాత్‌రూంల దగ్గర నిలబడి, పెట్ల మీద కూర్చుని ప్రయాణం చేస్తున్నారు.

ఓ పక్క వేడి గాడ్పులు, ఉక్క ప్రయాణీకుల్ని చిరాకు పెడుతున్నాయి. రైలు ఆగినప్పుడల్లా జనాలు "ఉఫ్! అబ్బా!" అనుకుంటూ ముఖానికి పట్టిన చెమట తుడుచుకుంటున్నారు. ఎండ తాపానికి తట్టుకోలేక చిన్న పిల్లలు ముఖారి రాగాలాపన చేస్తున్నారు. అలాంటి వాతావరణంలో కూడా ఆ పెద్ద మనిషి పక్కవారితో ఏకధాటిగా మాట్లాడేస్తున్నాడు.

మొదట్లో ఆయన కబుర్లు సరదాగా కాలక్షేపంగా వున్నా, రాను రాను అక్కడున్న వారికి కాస్త చిరాకు, విసుకు గలుగుతున్నట్లు వారి ముఖకవళికలు చెప్పసాగాయి. నెమ్మదిగా ఎవరిపాటికి వాళ్లు పేపరు తీసుకుని చదువుకోడమో, పత్రికలు ముఖానికడ్డు పెట్టుకోడమో, బెర్తుపై వాలి కళ్ళు ముయ్యడమో లాంటివి చేస్తూ ఆ వ్యక్తి నుంచి తప్పించుకోజొచ్చారు.

చివరికి ఆ పెద్ద మనిషికి ఏమీ తోచక ఎదురుగా ఖాళీగా కూర్చునివున్న నావైపు తిరిగి "తమరిదేవూరు?" అంటూ సంభాషణకి దిగాడు. చెప్పాను.

దాని తరువాత కులగోత్రాలు, ఉద్యోగం, పెళ్లి, జీతంతో సహా నా పుట్టు పూర్వోత్తరాలన్నీ ఒకదాని తరువాత ఒకటిగా అడగసాగాడు.

చాలా సేపటి నుంచి ఆయన ధోరణి వింటున్న నేను ఆయన్ని ఆటపట్టించాలనిపించి వున్నవాటికి లేనివి, లేనివాటికి వున్నవి కల్పించి చెప్పాను.

ఆ తరువాత ఆయన పేరు జనార్ధనం అని చెప్పి తన కుటుంబ వివరాలు నా దగ్గర చెప్పి ఆ పైని విషయాలు దేశ విదేశాల వైపుకి మళ్ళించి మన దేశం ఎలా తగులబడిపోతున్నదీ తనే దేశాధినేత అయితే ఏ విధంగా బాగుచేసి వుండేవాడో చెప్పసాగాడు.

నాకు అలాంటి వ్యక్తులంటే మహా సరదా.

అలాంటి వారికి కీఇచ్చి వదిలేస్తే మంచి కాలక్షేపంగా కూడా వుంటుంది. ఆయన మాటలకి మధ్య మధ్య తాళం వేస్తూ వెటకారమాడినా పాపం అర్థం చేసుకోని ఆ పెద్దమనిషి తన్నేదో పొగుడుతున్నాననుకుని ఉబ్బిపోతూ ఉత్సాహంగా మరింత గట్టిగా, ఘాటుగా ఉపన్యాసం కొనసాగించసాగాడు.

మొత్తానికి హైదరాబాద్‌దాకా జనార్ధనంగారితో బాగానే కాలక్షేపం అయింది. ఆయన తన పెట్టె, బ్యాగ్‌తో బస్‌స్టాండ్ వైపు, నేను నా బ్రీఫ్‌కేసూ, సూట్ కేస్‌తో ఆటోవైపు వెళ్ళిపోయాం.

నెలకి ఒకటి రెండుసార్లు ఆఫీసు పనిమీద ఢిల్లీ వెళ్ళడం, రావడం పరిపాటయిన నాకు రైల్లో రకరకాల వ్యక్తులతో ప్రయాణాలు చెయ్యడం, అనేక రకాల అనుభవాలు కలగడం అలవాటే - గానీ ఇలాంటి అతి ధోరణి వ్యక్తిని కలవడం ఇదే మొదటిసారి.

నిజానికి ఆయనలో నాకు ఏ లోపమూ కనబడలేదు. ఆయన ఆడే ప్రతీ మాటకరెక్టుగానే వుండేది. వచ్చిన చిక్కల్లా ఎదుటి వ్యక్తి తాను చెప్పే విషయాలకి ఎంత విలువిస్తున్నాడు - అన్నది ఆలోచించకుండా, పట్టించుకోకుండా నాన్‌స్టాప్‌గా మాట్లాడుకుపోవడమే! దాన్నే వయసువల్ల వచ్చే చాదస్తం అనికూడా అనొచ్చేమో!

ఇల్లు చేరిన నాకు గేటు దగ్గరే నా శ్రీమతి విచ్చుకున్న అరవిందంలాంటి ముఖంతో నారాకకి ఎదురు చూస్తూ, బ్రీఫ్‌కేస్‌ని, పెట్టెని అందుకుంది.

మా పెళ్ళయి కనీసం నాలుగు నెలలు కూడా నిండలేదు.

కొత్తదంపతులం, కొత్తకాపురం. అయినా ఈ విషయాలు పట్టించుకోని మా ముసలి మేనేజరు, పెళ్లికి ముందుకిలాగే ప్రతీ నెలా నెలకి వారమేసి రోజులు ఢిల్లీ హైడ్డాఫీసుకి పంపి నూతన దంపతుల్ని విడదీసి, విరహవేదనలో ముంచెత్తి, ఆపాపాన్ని మూటకట్టుకుంటున్నాడు.

ప్రతీసారి టూర్‌కెళ్తున్న రోజున నా రోజా కళ్లు మంకెనపువ్వులవడం, నేనొచ్చిన రోజు కలవరేకులవడం అలవాటయింది నాకు.

మధ్యాహ్న భోజనానికొచ్చి చెప్పిన కబురు విని రోజా నన్ను చుట్టేసుకుని కళ్ళంట నీళ్ళెట్టుకుని, "ఈ వెధవ తిరుగుడు ఉద్యోగం మానేసి స్థిరంగా ఓ చోటుండే ఉద్యోగం ఏదన్నా వెతుక్కోమ"ని గొడవచెయ్యడమే కాకుండా, మంకుపట్టు పట్టింది.

ఉద్యోగాలు దొరకని ఈ రోజుల్లో వున్న ఉద్యోగం వదులుకుని వేరేది వెతుక్కోడం అంత లేలికా? కానీ ఆ టైములో నా శ్రీమతికి విషయం చెప్పినా అర్థం చేసుకునే స్థితిలో వుండదని తెలిసిన నేను "అలాగేలే!" అని ఊరడించి సాయంకాలానికి నా సూట్‌కేస్‌లో బట్టలు తీసేసి, వేరేవి మూడు, నాలుగు జతలు సర్ది వుంచమని ఆఫీసుకెళ్ళాను.

ఢిల్లీ తీసుకెళ్లవలసిన పేపర్లతో ఆటో దిగిన నాకు నా రోజా రోజూలాగ నా కోసం ఎదురుచూస్తూ గుమ్మంవద్ద కనబడకపోవడంతో నాకు ఏదో లోటనిపించి "రోజా!" అంటూ లోపలికెళ్ళాను.

రోజా హాల్లో లేదు. వంటింట్లో కూడా లేదు. బెడ్‌రూమ్‌లోకెళ్ళాను. కింద నా సూట్‌కేస్ వుంది. మంచం మీద రోజా కళ్ళ మీద ముంజెయ్యి అడ్డు పెట్టుకుని, నా రాక గమనించనట్లే పడుకుని వుంది.

పెళ్లయిన ఈ కొద్ది నెలల్లో రోజా నేనాఫీసునుంచి వచ్చే సరికి అలా పడుకోడం చూడని నేను కంగారుగా ఆమె పక్కన కూర్చుంటూ, "రోజా!" అంటూ ఆమె చేతిని కళ్ళమీంచి తీశాను.

ఎర్రజీరలతో కళ్ళు ఉబ్బిపోయివున్నాయి. తెల్లని ముఖం ఎర్రగా కందిపోయివుంది.

"రోజా! ఏం చేస్తాం చెప్పు? ఉద్యోగమన్నాకా మనిష్టమా? బాస్ ఎలా చెప్తే అలా చెయ్యాలి - తప్పదు కదా! ప్రతీసారి ఇలా బాధపడితే ఎలా? నాకు మాత్రం నిన్నొదిలి వెళ్ళాలనుంటుందా? ఈ సారేకదా వచ్చిన రెండు రోజులు తిరక్కుండానే మళ్ళీ వెళ్ళవలసి వచ్చింది! నిజమే! నీ బాధ నేనర్థం చేసుకోగలను. మార్కెటింగ్ సైడు ఉద్యోగమన్నాకా ఈ టూర్లు తప్పవు. నువ్వు చెప్పినట్లు ఈసారి వచ్చాకా వేరే ఏదన్నా జాబ్ కోసం ప్రయత్నిస్తానులే - లేచి ముఖం కడుక్కుని రా! అలా షికారెళ్ళి వద్దాం" అంటూ రోజాని లేవదియ్యబోయిన నా చేతిని విసిరికొట్టి -

"మీరు అసలు వెళ్ళేది క్యాంపులకేనా?" అంది సూటిగా నాకేసి చూస్తూ.

ఆ ప్రశ్నకి ఒక్కసారిగా మతిపోయినట్లయి "ఏమయింది? ఎందుకొచ్చిందా అనుమానం?!" అన్న నావైపు వెటకారంగా చూస్తూ - "ఆ పెట్టె తెరిచి చూడండి" అంది రోజా.

మంచం మీదనుంచి గెంతినట్లే దిగి కింద వున్న పెట్టె తెరిచి చూశాను. అందులో చీరలు, జాకెట్లు, పౌడరు, స్నోలవంటి సామానుతో పాటు తన ప్యాంటు, షర్టు కూడా వుండటం షాకయిపోయాను.

ఆ బట్టలకేసి, రోజాకేసి మార్చి మార్చి వెర్రి వాడిలా చూడసాగాను. సూట్‌కేస్ మూసి బాగా పరీక్షించాను. తన సూట్‌కేస్ లాంటిదే. కాస్త రంగు తక్కువ. బాగా పరీక్షగా చూస్తేగానీ తెలీదా విషయం. రైల్లో తనతోపాటు స్త్రీ, పురుషులనేకమంది ప్రయాణం చేశారు. దిగేటప్పుడు పెట్టె మారిపోయి వుంటుంది. కానీ తన ప్యాంటు, షర్టు అందులోకెలా వచ్చాయన్నది అంతుచిక్కటంలేదు.

రోజా కోపానికి కారణం అర్థమయింది. కానీ నిజాన్ని ఎలా చెప్పడం? మతిపోయిన వాడిలా కూర్చుని ఆలోచించసాగాను. రాగానే ఏమేం చేశానో గుర్తు చేసుకోసాగాను. వెంటనే గుర్తొచ్చింది.

టూర్ నుంచి రాగానే విప్పిన ప్యాంటు షర్టు ఆ పెట్టె తెరిచి అందులోనే పడేశానని.

నెమ్మదిగా లేచొచ్చి తన్ని అర్థంచేసుకోమని బ్రతిమాలాను. ప్రయాణంలో పెట్టె మారిపోయిందని, రాగానే పెట్టె తెరచి చూడకుండా, ఎలాగో పెట్లోవి ఉతికే బట్టలేకదా! అన్న ఉద్దేశంతో విడిచిన బట్టలు కూడా అందులో కుక్కేశానని చెప్పగానే రోజాలో మార్పు కనబడింది.

'హమ్మయ్య!' అనుకుంటూ ధైర్యాన్ని తెచ్చుకుని రోజా మూడ్ను మార్చడానికి ఆమెని అంటిపెట్టుకునే తిరుగుతూ కబుర్లు చెప్పసాగాను.

'నూతన దంపతుల్ని టూర్ల పేరిట వారమేసి రోజులు విడదియ్యడమే కాకుండా ఇలాంటి ఇబ్బందుల్ని కలిగించి ఇక్కట్లపాలు కూడా చేస్తున్నావా దేముడా! అనుమానమనే పురుగు ఎవరి బుర్రలో సన్నాదూరిందంటే అమృత కుంభంలాంటి కాపురం విషకుంభమే అవుతుంది భగవాన్! నన్ను ఇక ఇలాంటి ఇబ్బందులపాలు కానివ్వకు బాబూ!' అంటూ మనసులోనే దైవాన్ని ప్రార్థించాను.

ఆ రాత్రల్లా రోజాతో సరదాగా గడిపి మర్నాడుదయమే ఢిల్లీ బయలుదేరాను.

వెళ్ళిన నాలుగు రోజుల్లోనే ఆఫీసు పన్లన్నీ ముగించుకుని రోజా కోసం ఓ చీర, ఢిల్లీ స్వీట్లు కొని హైదరాబాద్ చేరాను.

ఈ రోజు వచ్చేస్తున్నట్లు టెలిగ్రామిచ్చినా రోజా గేటు దగ్గరకి ఎదురు రాకపోవడంతో నా మనసు చిన్నబుచ్చుకుంది. సూట్‌కేస్ తీసుకుని లోపలికెళ్ళిన నాకు ఇల్లు తాళం పెట్టి వుండటం మరీ ఆశ్చర్యాన్ని కలిగించింది.

"ఎక్కడికెళ్లింది? రాత్రి పది దాటుతున్న ఈ టైములో ఒంటరిగా ఎక్కడికెళ్తుంది? స్నేహితులెవరింటికీ వెళ్ళే టైము కాదే! ఊళ్ళో తమకి కావలసిన బంధువులెవరూ కూడా లేరు!' అని ఆలోచిస్తూ పక్కింటివాళ్ళ బెల్లు నొక్కాను.

తలుపు తీసిన ఇంటి యజమానురాలు "రోజా మీరొస్తే ఇమ్మం"దంటూ తాళాల గుత్తితో పాటు ఓ కవరు కూడా అందించింది.

తాళం తీసి పెట్టె పక్కన పడేసి కవరు చింపి ఆత్రుతగా చదవసాగాడు. ఉత్తరం ప్రారంభించిన తీరు చూడగానే గుండె లయ తప్పింది.

"మిస్టర్ సుధాకర్! మీరింత నయవంచకులని కల్లోకూడా ఊహించలేదు.

పేపర్లలో భార్యల్ని మోసం చేసే భర్తలెందరి గురించో చదివాను. అవన్నీ చదువుతుంటే కథలు చదివినట్లు భావించేదాన్ని కానీ నా నిజజీవితంలోనే అలా జరుగుతుందని, అలాంటి దగా, మోసమే నాకూ జరుగుతుందని ఎన్నడూ అనుకోలేదు. కట్నం కోసం పదిమందిని పెళ్లాడిన పురుషుడి గురించి ఓ సారి పేపర్లో చదివి ఆశ్చర్యపోయాను. అదే నా విషయంలోనూ జరుగుతోందని తెలిసిన నేను ఎలా ఫీలవుతానో ఊహించండి.

మీరు కూడా మా నాన్నిచ్చిన కట్నానికే ఆశించి ఈ పెళ్లి చేసుకున్నారన్నమాట. మన పెళ్లయి నాలుగు నెలలు తిరక్కుండానే మీరు మీకు పెళ్లి కాలేదని అబద్ధాలు చెప్పి పెళ్లికూతుళ్లని చూస్తున్నారా?

నాలా ఇంతవరకూ ఎందర్ని మోసగించారు? ఇంకా ఎందర్ని మోసం చెయ్యదల్చారు? ఎందుకిలా స్త్రీల జీవితాలతో చెలగాటాలాడుతున్నారు? బుద్ధిమంతుడిలా నటిస్తూ, డబ్బు కోసం మాలాంటి వాళ్ళ గొంతుకలు ఇలా కోస్తారని అనుకోలేదు.

'నిన్న వచ్చిన ఓ ఆడపిల్ల తండ్రిద్వారా మీరు ఆడుతున్న నాటకమంతా బయటపడింది. నాలుగు నెల్లకే నా మీద మీకు మోజు తీరిపోయి మళ్ళీ పెళ్లి కొడుకు అవుదామనుకుంటున్నారా?

ఆ రోజు మీ సూట్‌కేస్‌లో పరాయి స్త్రీ బట్టలు చూసినప్పుడే నాకు అనుమానం కలిగింది. ఆ రోజు చెప్పిన కట్టుకథ నమ్మేను కానీ ఇప్పుడు నిజం తెలిసింది. మీరు టూర్‌ల పేరిట ఇక్కడా, అక్కడా స్త్రీలతో తిరుగుతున్నారన్నమాట.

ఓ విషయం మర్చిపోకండి. మీలాంటి మగవాళ్ళేం చేసినా 'నాఖర్మ' అనుకుని పడుండే స్త్రీని కాను. నా చేతిలో డిగ్రీ వుంది బ్రతకలేకపోను.

కానీ మిమ్మల్ని ఇలా వదలనని గుర్తుంచుకోండి. త్వరలో మిమ్మల్ని కోర్టుకి పిలిపించకపోతే నా పేరు రోజాకాదు. అంతదాకా ఎక్కడికెళ్తున్నానన్నది మీకనవసరం. కోర్టులో కలుద్దాం. రోజా''

ఆ ఉత్తరాన్ని నాలుగుసార్లు చదివాను. కళ్ళు చీకట్లు కమ్ముతున్నాయి.

నేనేమిటి? మళ్ళీ పెళ్ళి చేసుకోవడమేమిటి?! నాకు సంబంధాలు రావడమేమిటి? అవయినా నా భార్య దగ్గరకే నాకు పెళ్లి సంబంధాలు రావడమా? ఎంత ఆలోచించినా ఇదెలా జరిగిందో తుదీ - మొదలు దొరకటం లేదు.

ఎవరొచ్చారు? ఏం జరిగింది? ఎలా జరిగింది రోజా ఇల్లు విడిచి వెళ్ళిపోయేటంత ప్రమాదకరమైన ఈ సంఘటన ఎవరివల్ల జరిగింది? అంటూ ఆలోచిస్తున్న కొద్దీ ఆలోచన తెగక బుర్రవేడెక్కసాగిందేగానీ తన ప్రశ్నకి - జవాబు దొరకటంలేదు.

వారం రోజులు గడిచిపోయాయి. రోజా తండ్రి నుంచి వచ్చిన ఉత్తరం చదివి వున్న మతి కూడా పోయింది. రోజా రాసిన విషయాల్నే మరింత ఘాటైన పదాలతో రాసిన ఉత్తరం అది.

మామగారి ఉత్తరం చూసి చిర్రెత్తుకొచ్చి, దమ్ములుంటే కోర్టులో తన నేరాన్ని రుజువుపర్చమనీ, నా నిర్దోషిత్వాన్ని నేనూ నిరూపించుకుంటానని మరింత ఘాటుగా జవాబు రాసివేశాను.

రోజా వెళ్ళి నెల్లాళ్ళు దాటింది.

రోజా అంత తెగతెంపులుగా ఉత్తరం రాసినా ఆమె మీద కోపం రావటం లేదు. పైగా ఆమె ఎడబాటుని తట్టుకోలేక పోతున్నాడు. మనసు పడుతున్న వేదన ఎవరికీ చెప్పుకోలేక కృంగిపోసాగాడు. అతన్ని ప్రతీ క్షణం వేధిస్తున్న ప్రశ్నల్లా రోజాని ఏ సంఘటన ఇంతలా బాధించి, నాకు దూరమయ్యేలా చేసింది అన్నదే.

ఆఫీసునుంచి ఇంటికి రావాలనిపించేది కాదు.

వీలయినంతమటుకు టూర్లు వేయించుకుని ఇంటిని మర్చిపోయే ప్రయత్నించేవాడు.

పార్కులో కూర్చున్న నన్ను "బాబూ నీ పేరు సుధాకర్ కదూ?" అంటూ పలకరించిన వ్యక్తిని "ఎవరా" అని ఆశ్చర్యంగా చూశాను.

"ఆ రోజు రైల్లో మనం కలిసి ప్రయాణం చేశాం గుర్తులేదూ!" అంటూ పక్కనే బెంచీమీద కూర్చున్న పెద్దమనిషిని చూడగానే గుర్తొచ్చి "ఓ మీరా!

జనార్థనం గారు కదూ?'' అంటూ పలకరించాను.

"ఆ - ఆ గుర్తున్నాననన్నమాట. మీ ఇల్లు ఇక్కడికి దగ్గరేకదా! మా ఇల్లూ ఇక్కడే! ఆరోజు రైల్లో అనుకుంటూనే నా అడ్రస్ ఇవ్వడం మర్చిపోయాను. అన్నట్లు ఆ మధ్య మీ ఇంటికోసారి వచ్చాను. మీరు ఊళ్ళో లేరుట. మీ ఆవిడ చెప్పింది'' అనగానే -

"మీకు మా ఇల్లెలా తెలిసింది! నేను మీకు అడ్రస్ ఇవ్వలేదుగా?'' అన్నాను.

"బాబూ! అనుభవంగలవాళ్ళం మీ అడ్రస్ తెలుసుకోడం మాలాంటివాళ్ళకేం కష్టం? నువ్వు నోటితో చెప్పకపోయినా నీ బ్రీఫ్‌కేస్ మీద అంటించిన స్టిక్కర్ మీద చూసి నోట్ చేసుకున్నానండి!'' అంటూ తన తెలివికి తనే గర్వపడుతూ నవ్వసాగాడు.

"అలాగా!'' అని ఊరుకున్న నన్ను చూసి "'ఎందుకొచ్చారు?' అని అడగరేం?'' అన్నాడు.

"ఊరికేనే అయివుంటుందని అడగలేదు. అడగమన్నారుగనక అడుగుతున్నాను. ఎందుకొచ్చారు?'' అన్నాను ప్రశ్నార్థకంగా చూస్తూ.

"మా ఆఖరమ్మాయి పెళ్లికెదిగి వుంది. పెళ్లి చెయ్యాలి. సంబంధం కోసం వచ్చాను'' అన్నాడు.

"మా ఇంటి దగ్గర్లో ఎవరన్నా పెళ్లికొడుకులున్నారా?'' అన్నాడు.

"మీ ఇంటి దగ్గర్లో కాదు మీ ఇంట్లోనే'' అన్నాడు - 'మీ ఇంట్లోనే' అన్న పదం నొక్కి పలుకుతూ.

"మా ఇంట్లోనా?! మా ఇంట్లో వుండేది ఇద్దరమే! పెళ్లికొడుకెవరున్నారు?'' అన్నాను.

"చూడండి బాబూ! పెద్దవాడిని, చాదస్తుడిని అనుకోకపోతే ఒక్క విషయం చెప్తాను ఏమీ అనుకోకండి. ఇంట్లో చక్కటి చుక్కలాంటి భార్యని పెట్టుకుని పెళ్ళవలేదని రైల్లో ఎందుకండీ అబద్ధాలు ఆడేరు? ఆడపిల్లలు గల మాలాంటి తండ్రుల మనసుల్లో ఆశలు రేపి, మీ ఇంటిదాకా రప్పించుకోడానికా?

నిజంగా మీరు పెళ్లికొడుకని నమ్మి పుట్టెడు ఆశల్ని మనసులో నింపుకుని, మీ ఇంటికి వచ్చి, మీ భార్య అని తెలీక రైల్లో కలిసి ప్రయాణం చేసిన విషయం, మన మధ్య జరిగిన సంభాషణ అంతా చెప్పి, నా పిల్ల వివరాల కాగితం ఇస్తూ నా పిల్ల పెళ్లి సంబంధం కోసం మాట్లాడాలని వచ్చానని చెప్పాకా తను నీ భార్యనని చెప్పగానే వెర్రిపీనుగనయి, వెర్రి వెధవలా కాళ్ళీడ్చుకుంటూ ఇంటికొచ్చాను.

"ఎవరితోనన్నా వేళాకోళమాడినా, అబద్ధమాడినా దాని పర్యవసానం గురించి ఆలోచించాలి బాబూ!" అంటూ చెప్పుకుపోతున్న అతని చీవాట్లనండి, హితవాక్కులనండి నా బుర్రని తిప్పేశాయి.

ఆ రోజు రైల్లో 'నీకు పెళ్లయిందా బాబూ!' అని జనార్దనం గారు అడగ్గానే సరదాకి 'కాలేదండీ!' అని ఆడిన అబద్ధం యొక్క పర్యవసానం ఎంత కొంపముంచింది! ఇటు ఈ ముసలాయన చేత చీవాట్లు అటుంచి - అటు రోజా, తండ్రి చేత కోర్టుకెక్కించేదాకా వెళ్ళిందే! ఎంత పొరపాటు జరిగింది.

ఒకదానికొకటి తోడన్నట్లు ఆ రోజు నా సూట్‌కేస్ మారిపోవడం, నే లేని టైములో ఈ పెద్దమనిషి నా కోసమే పెళ్లి సంబంధానికి రావడం నా కొంప ముంచాయిగదా! అనుకుంటూ జనార్దనంగారి దగ్గర క్షమార్పణ చెప్పుకుని, ఆయనకి మా ఇంట్లో జరిగిన గొడవంతా చెప్పుకుని - "జనార్దనం గారూ! నా కాపరం నిలబడాలంటే మీరు నాతో నా రోజా దగ్గరకొచ్చి జరిగిందంతా చెప్పాలి. లేదంటే నా ఇల్లు కూలిపోవడమే కాకుండా కోర్టుకెక్కి నవ్వులపాలవుతుంది నా సంసారం" అంటూ బతిమాలసాగాను.

తల పండిన జనార్దనంగారు నెరిసిన మీసాల్ని దువ్వుకుంటూ "చిన్నవాళ్ళ అనాలోచితపు పన్లు, వేళాకోళపు మాటలు ఎందర్ని బాధిస్తాయో, ఎంత ప్రమాదానికి దారితీస్తాయో చూశారా?" అంటూ మళ్ళీ ఓ గుణపాఠం చెప్పి -

"పదండి రేపే మీ అత్తారింటికెళ్ళి మీ ఆవిడని తీసుకొద్దాం" అన్నాడు నవ్వుతూ జనార్దనం గారు నా భుజం తట్టి లేస్తూ. ✳

**(29.11.1996 స్వాతి సపరివార పత్రిక)**